క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ఆదిమూలం పర్యటన

పిచ్చాటూరు: ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు కేటీ హరిశ్చంద్రారెడ్డి, అపరంజిరాజు తెలిపారు. ఎమ్మెల్యే ఉదయం 10 గంటలకు పిచ్చాటూరు మండలం కీళపూడిలోని జలకంఠేశ్వరస్వామి ఆలయం సమీపంలో, మధ్యాహ్నం 2 గంటలకు నాగలాపురం మార్కెట్ యార్డు సమీపంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, పట్టభద్రులు హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్ బీమా పంపిణీ


బాధితులకు వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న సర్పంచ్ జయ

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడు పేట పంచాయతీ గాంధీపురంలో శుక్రవారం వై. నారాయణ(31) గుండెపోటుతో మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన కుటుంబ సభ్యులకు సర్పంచ్ జయ, సచివాలయ కార్యదర్శి ఏ. మనోజ్‌కుమార్ కలిసి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కే.శామ్యూల్, వలంటీర్ పుష్ప, సచివాలయ గృహసారథి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం


మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలగణేషన్

సత్యవేడు: మండలంలో చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ బాలగణేషన్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఆయన శుక్రవారం గృహ నిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రోజు వారి లక్ష్యం నెరవేరేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జే.వెంకటసుబ్బయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వదంతులు నమ్మొద్దు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కోర్టు సమీపంలో నిర్మిస్తున్న సచివాలయ భవన నిర్మాణంపై వస్తున్న వదంతులను నమ్మొద్దని కమిషనర్ బాలాజీనాయక్ తెలిపారు. పట్టణంలోని పురపాలకసంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు సమీపంలో నిర్మిస్తున్న సచివాలయ భవనం కర్మక్రియల మండపంలో నిర్మిస్తున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. ఇందులో వాస్తవం లేదని తెలిపారు. 2016–17 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ నిధులతో కర్మక్రియల మండపం నిర్మాణానికి పునాదులు వేసిన మాట వాస్తవమేనన్నారు. అయితే చుట్టుపక్కల నివాస సముదాయాలు ఉండడంతో ఆ నిర్ణయం విరమించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్మిస్తున్న సచివాలయ భవనం అందరికీ అందుబాటులో ఉండేలా పనులు చేస్తున్నామని చెప్పారు.

ఉపాధిలో చెరువు వరవ కాలువ పనులు


వరవ కాలువ మరమ్మతులు చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధి హామీ పథకం కింద మండలంలోని కారణిమిట్టలోని చెరువు వరవ కాలువ మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. 60 మంది కూలీలు పనిచేస్తున్నారు. కాలువలో పూడిక తీసి మట్టిని కట్టకు ఇరువైపులా పోస్తున్నారు. తద్వారా కట్ట బలోపేతం అవుతుందని కూలీలు చెబుతున్నారు. ఈ పనులకు ఉపాధిలో రూ.4 లక్షలు మంజూరైనట్లు ఏపీఓ భానుప్రియ తెలిపారు. కూలీలకు రోజుకు రూ. 180 కూలి గిట్టుబాటు అవుతోందని, 10 రోజుల పాటు పనులు జరుగుతాయన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.10,116 విరాళం


విరాళం అందజేస్తున్న బండి నాగరత్నం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన నాగరత్నం రూ.10,116 విరాళంగా అందజేశారు. ఆలయాధికారులు ఈ నగదు స్వీకరించి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దాతకు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ సాగు.. లాభాలు బాగు

- బుచ్చినాయుడుకండ్రిగలో 30 ఎకరాల్లో నిమ్మ మొక్కల పెంపకం
- సాగుకు ఎకరాకు ఏడాదికి రూ.15 వేల ఖర్చు
- రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు ఆదాయం



నిమ్మచెట్లు, (ఇన్‌సెట్) నిమ్మచెట్లల్లో ఉన్న కాయలు

బుచ్చినాయుడుకండ్రిగ: నిమ్మ సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చని బుచ్చినాయుడుకండ్రిగ రైతులు చెబుతున్నారు. ఇక్కడ 15 మంది రైతులు 30 ఎకరాల్లో నిమ్మ పంటను సాగు చేస్తున్నారు. ఆరుతడి పంట కావడంతో మెట్ట భూముల్లోనే నిమ్మ మొక్కలు నాటుకోవచ్చు. విద్యుత్ వినియోగం తగ్గుతుంది. కూలీలతోనూ ఇబ్బంది ఉండదు. అంతేగాక చీడపీడల బెడద ఎక్కువగా ఉండదు. నిమ్మ మొక్కలు ఎకరాకు 130 సరిపోతాయి. ఐదేళ్ల తర్వాత కాపుకు వస్తాయి. అప్పటి నుంచి 10 ఏళ్ల పాటు కాయలు కాస్తాయి. అంతేగాక అంతర పంటలు వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు. కొద్దిపాటి నీరు ఉన్నా సాగుకు ఇబ్బంది ఉండదు. డ్రిప్ పరికరాలు ఏర్పాటుచేసుకోవడం ద్వారా తక్కువ నీరే సరిపోతుంది. ఇక్కడి రైతులు ఒక్కో మొక్క రూ.25లతో తిరుపతిలోని ఆచార్య రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి తీసుకొచ్చి నాటుతున్నారు. మొక్కల కొనుగోలు నుంచి గుంతలు తవ్వకం, మొక్కలు నాటి సంరక్షణకు ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు ఖర్చు అవుతుందని, ఈ లెక్కన ఐదేళ్లకు రూ.75 అవుతుందని రైతులు చెబుతున్నారు. చెట్లు కాపుకి వచ్చిన తర్వాత ఎకరాకు సంవత్సరానికి రూ. 20 వేలు ఖర్చువుతుంది. ఒక్కో చెట్టు సుమారు వెయ్యి నిమ్మకాయలపైగా కాస్తుంది. కాపు 6 నెలలు ఉంటుంది. వాణిజ్య పంట కావడంతో నిమ్మకాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. రైతులు నిమ్మకాయలను చెన్నై, నెల్లూరు జిల్లాలోని గుడూరు మార్కెట్లకు తీసుకెళ్లి అమ్ముతున్నారు. నిమ్మకాయలకు మంచి ధర వస్తే ఎకరాకు అన్ని ఖర్చులు పోను రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలు మిగులుతుందని రైతులు తెలిపారు. గత ప్రభుత్వంలో నిమ్మ సాగుకు ఎలాంటి ప్రోత్సాహాలు అందలేదని రైతులు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వమైనా చేయూత ఇవ్వాలని కోరుతున్నారు.

నిమ్మను ఆశించే చీడ పీడలు

నిమ్మ చెట్లకు ఎక్కువగా ఆకు ముడత, కాయకు గంజి మరక, కాయ బొప్పర, పేనుబంక, పండు ఆకు, ఎండు కొమ్మ, నల్లబూడిద, బూడిద తెగులు సోకుతాయి. వాటి నివారణకు స్టాప్, ఓబ్రాన్, ఓమైట్, నంబరు వన్ కంపెనీలకు చెందిన మందులు ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఉద్యానవన శాఖాధికారి శారద తెలిపారు.

సబ్సిడీపై ఎరువులు ఇవ్వాలి



నిమ్మ పంటకు ప్రభుత్వం సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలి. కాయలను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఔషధాల్లో వాడుకోవాలి. లేదా స్థానికంగా మార్కెట్ సదుపాయం కల్పించే మరింత మంది సాగుకు ముందుకు వస్తారు.

– రాజయ్యనాయుడు, రైతు

మొక్కలు ఉచితంగా ఇవ్వాలి



మేము తిరుపతిలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి మొక్కలు తెచ్చుకుంటున్నాం. ఒక్కో మొక్క రూ.25 అవుతోంది. మొక్కలను ఉచితంగా ఇస్తే రైతుకు కొంచెం ఆసరాగా ఉంటుంది. స్థానికంగా మార్కెట్ సదుపాయం కల్పించాలి.

– లక్ష్మీనారాయణ, రైతు

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో శ్రీసిటీ స్టాల్ ప్రారంభం


ఏపీ సీఎం, ఇతర ప్రముఖుల సమక్షంలో శ్రీసిటీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న నితిన్ గడ్కరీ


విశాఖలో ఏర్పాటు చేసిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో శ్రీసిటీ స్టాల్

వరదయ్యపాళెం: విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)–2023లో శ్రీసిటీ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఇతర ప్రముఖుల సమక్షంలో శుక్రవారం కేంద్ర రోడ్డు రవాణా అండ్ హైవే శాఖా మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. స్టాల్‌ను తిలకించిన వారు శ్రీసిటీ విశిష్టతను ప్రశంసించారు. ఇందులో డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, స్కేల్–డౌన్ 3డీ మోడళ్ల ద్వారా శ్రీసిటీ వ్యాపార నగరం ప్రత్యేకతలు, స్థాన ప్రయోజనాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలను హైలైట్ చేశారు. శ్రీసిటీలోని కొన్ని పరిశ్రమల ప్రతినిధులు ప్రదర్శించిన ఎఫ్‌ఎంసీజీ, వివిధ బ్రాండ్‌ల ఎయిర్ కండీషనర్లు, ఆటో మొబైల్ కాంపోనెంట్లు, వీల్ చైర్లు, ఇసుజు కార్లు మేడ్ ఎట్ శ్రీసిటీ ఉత్పత్తులు సమ్మిట్‌కు విచ్చేసిన ప్రతినిధులను విశేషంగా ఆకర్షించాయి. అనంతరం ఇండస్ట్రియల్ అండ్ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై జరిగిన ప్యానెల్ చర్చలో డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడారు. స్థిరమైన ఆర్థికాభివృద్ధికి మౌలిక సదుపాయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలు అందించే అనువైన వ్యాపార వాతావరణాన్ని పెట్టుబడిదారులు పరిశీలిస్తారని తెలిపారు. ఈ కోవలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వం పెట్టుబడిదారులపై ప్రభావం చూపిందన్నారు. ప్రధాన నౌకాశ్రయాలతో కూడిన సుదీర్ఘ తీరప్రాంతం, రోడ్డు, రైలు నెట్‌వర్క్‌లు, నాణ్యమైన శక్తి, సాంకేతికంగా నైపుణ్యం కలిగిన మానవశక్తి, గొప్ప ఖనిజ వనరులు, ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ అండ్ బిజినెస్ పార్కులతో ఏపీ అగ్రస్థానంలో ఉంటూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆహ్వానిస్తోందని పేర్కొన్నారు.

జూపూడితో ఎస్సీ నేతల భేటీ


జూపూడి ప్రభాకర్‌రావుకు మొక్కను అందజేస్తున్న ఎస్సీ సంఘాల నాయకులు

ఏర్పేడు: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావును మండలంలోని పలు ఎస్సీ సంఘాల నాయకులు శుక్రవారం కలిశారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో జూపూడిని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువ కప్పి సన్మానించి, మొక్కను అందజేశారు. ఎస్సీల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కుల సంఘాల నాయకులు ఐతేపల్లి గురునాథం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మోసాలు చేస్తే కేసులు తప్పవు


ధాన్యం తూకాలను పరిశీలిస్తున్న మహేశ్వర్

ఏర్పేడు: తూకాల్లో మోసం చేస్తే కేసులు తప్పవని కొలతలు, తూనికల శాఖ తిరుపతి అధికారి మహేశ్వర్ వ్యాపారులను హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని రాజులపాళెం పొలాల్లో రైతుల నుంచి వ్యాపారులు సేకరిస్తున్న ధాన్యం తూకాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి సక్రమమైన తూకాలతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. తూకాల్లో తేడాలుంటే రైతులు లీగల్ మెట్రాలజీ తూనికలు, కొలతల శాఖకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దళారులు రైతులను మోసాలు చేయాలనుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని రాంబట్లపల్లెలో కోడిపందేల స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారం రహస్య సమాచారం మేరకు కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా నలుగురు కోడి పందేలరాయుళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేర్నాటికి మద్దతుగా ప్రచారం


పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడులో ప్రచారం చేస్తున్న కేవీ భాస్కర్ నాయుడు


నాగలాపురం మండలంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


ప్రచారం చేస్తున్న సచివాలయం కన్వీనర్లు


యానాదివెట్టులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పిచ్చాటూరు: వైఎస్సార్ సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి మద్దతుగా పలువురు నాయకులు శుక్రవారం అడవికొడియంబేడులో ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటును పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పాలపద్మనాభం, నాయకుడు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం మండలం వేబాక్కం, వెళ్లూరు గ్రామాల్లో శుక్రవారం సచివాలయ కన్వీనర్ మోహన్ మొదలియార్ ప్రచారం చేశారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, ఈశ్వర్, సర్పంచ్ మునివేలు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు కేతినేని వెంగళరావు కోరారు. శుక్రవారం చిన్న సింగమాల వీరభద్రయ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ప్రచారం ప్రారంభించారు. అనంతరం చిన్న సింగమాల, పెద్ద సింగమాల, గాబచేను, గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రులను కలిసి ప్రథమ ప్రాధాన్యత ఓటును పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ భక్తవత్సలం, సచివాలయ కన్వీనర్లు పూడి నరసింహనాయుడు, భాస్కర్‌రెడ్డి, చంద్రబాబు, సాయిబాబానాయుడు, నరసింహ, మోహన్ రఘురాం, దీపక్, నాగరాజు, సునీత, వెంకటరామిరెడ్డి, నాగరాజు, అశోక్, తీర్థ రామ్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

వరదయ్యపాళెం: వైఎస్సార్ సీపీ బలపరిచిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి కోరారు. ఆయన శుక్రవారం యానాదివెట్టు, చిన్న పాండూరు గ్రామ పంచాయతీల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ చిన్నా, మాజీ సర్పంచ్ తిలక్‌బాబు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, స్థానిక గ్రామ పంచాయతీల కన్వీనర్లు గుజ్జల పూడి గీత, కొమిరి మాధవయ్య, మహేంద్ర, గిరి, మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు సురుటపల్లిలో శనిమహా ప్రదోషం


విశేషాలంకరణలో ప్రదోష నందీశ్వరుడు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లి శ్రీపళ్లికొండేశ్వరాలయంలో శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకుని శని మహా ప్రదోషం నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్యలో ఆలయంలోని నంది మండపంలో నందీశ్వరునికి అభిషేకాలు చేస్తామన్నారు. శని మహా ప్రదోషానికి ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారని పేర్కొన్నారు.

పుష్పరథంపై సుబ్రమణ్యేశ్వరస్వామి

పుత్తూరు రూరల్: సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి అమ్మవార్లు పుష్పరథంపై విహరించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు పుష్పరథంపై పురవీధుల్లో ఊరేగారు. ఇంటింటా కర్పూరహారతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త సుందరం పర్యవేక్షించారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి


సత్యవేడులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సత్యవేడు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్‌రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి కోరారు. వారు శుక్రవారం సత్యవేడులోని రాంనగర్, కోటమిట్ట, గాంధీరోడ్డు, గంగమిట్ట, నేతాజీ రోడ్డులోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం చేశారు. సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు బొప్పన సోమశేఖర్ మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ మండల కన్వీనర్లు పునిదకుమార్, ఈశ్వరయ్య, మాణిక్యం, రాబిన్, నరేష్, రమేష్, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, మాస్తానీ, మునివేలు, కృష్ణయ్య, చిన్నబ్బ తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ


నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ భువనేశ్వరి

శ్రీకాళహస్తి రూరల్: నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందని ఎంఈఓ భువనేశ్వరి అన్నారు. మండలంలోని అక్కుర్తి పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేకదృష్టి సారించి, సనాతన మార్పులు తీసుకువచ్చిందన్నారు. ప్రతి పేద విద్యార్థీ ఉన్నత చదువులు చదుకోవాలనే ఉద్దేశ్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మఒడి, విద్యాదీవెన, విద్యావసతి పథకాలను తీసుకొచ్చిందన్నారు. అక్కుర్తి ఉన్నత పాఠశాలకు ఆరు తరగతి గదుల నిర్మాణానికి రూ.78 లక్షలు, మరుగుదొడ్లు, వంటగది, మినరల్ వాటర్ ప్లాంట్ తదితర నిర్మాణాలకు రూ.42 లక్షలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. మండలంలో నాడు–నేడు పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గుణాత్మక విద్య కేవలం ప్రభుత్వ పాఠశాలలో అందుతోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ గంగారామయ్య, హెచ్‌ఎం లక్ష్మయ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యరహిత రాష్ట్రానికి కృషి చేయాలి

- స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరెడ్డి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

శ్రీకాళహస్తి రూరల్: మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుకోవటానికి ప్రతి పౌరుడు కృషి చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శ్రీకాళహస్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీటీ శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్ఈబీ ఏఎస్పీ ఆదేశాల మేరకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సులు విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావటమే ప్రభుత్వం ఉద్దేశమని తెలిపారు. డ్రగ్స్ తీసుకోవడంతో పలు అనర్థాలు కలుగుతాయని చెప్పారు. సారా, గంజాయి విక్రయిస్తున్న వారిని గుర్తిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇష్టపడి చదవాలని, అప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని సూచించారు. విద్య కోసం ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన్, పీవీ.నరసింహులు, సీహెచ్ మనోహర్, సీ సుబ్రమణ్యం, ఎస్.జయకుమార్, ఏ.శ్రీనివాసులు, ఎమ్.వాసవి, టీ.హరిత పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


రోగులకు మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది

ఏర్పేడు: మండలంలోని కోబాకలో సర్పంచ్ బుజ్జమ్మ, ఏర్పేడు పీహెచ్‌సీ డాక్టర్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కోబాక, ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచి వచ్చిన 70 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రత, పారిశుద్ధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుడు చెంగల్రాయులు, ఏఎన్ఎం కామాక్షి, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల కోసమే ఇంటిబాట


తలారివెట్టులో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసమే ఇంటి బాట కార్యక్రమాన్ని చేపట్టినట్టు కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలిపారు. మండలంలోని తలారివెట్టు, వెస్టువరత్తూరు, కారణి, గ్రామాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, నాదెండ్ల మురళి వెళ్లి పిల్లలు చదువుతున్నారా లేదా, అని పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను తల్లిదండ్రులకు తెలిపి ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చూస్తున్నారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు రాత్రి 7 గంటల నుంచి 9 వరకు హౌస్ విజిటింగ్ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. తద్వారా పిల్లలు పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

సర్వే విధానం పరిశీలన


ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శాస్త్రి

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరుగుతున్న దీర్ఘకాలిక, అంటు వ్యాధులు గుర్తింపు (ఎన్‌సీడీసీడీ), శాంపుల్ సేకరణ సర్వే విధానాన్ని శుక్రవారం రాష్ట్ర ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శాస్త్రి పరిశీలించారు. రికార్డులు, సర్వే చేస్తున్న విధానాన్ని పర్యవేక్షించారు. పీహెచ్‌సీ పరిధిలో 51 కేసులు గుర్తించగా వాటిలో ఒకటి పాజిటివ్‌గా నిర్ధారణ జరిగినట్లు తెలిపారు. సర్వే, చికిత్సలపై ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు హర్షవర్ధన్, అభిజ్ఞ, ఫిజియోథెరపిస్టు రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.